# 'జైలర్-2'లో బాలకృష్ణ?



**దక్షిణాదిలో** సెన్సేషనల్ కాంబోకు రంగం సిద్ధమైందా? అగ్ర హీరోలు రజనీకాంత్, బాలకృష్ణ సిల్వర్ స్క్రీన్‌పై తమ పవర్‌ప్యాక్డ్ పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టబోతున్నారా? ఇప్పుడీ వార్త దక్షిణాదిలో హాట్‌టాపిక్‌గా మారింది. రజనీకాంత్ నటించిన 'జైలర్' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో సీక్వెల్‌గా రాబోతున్న 'జైలర్-2'పై భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఇందులో ఓ కీలకమైన అతిథి పాత్ర కోసం చిత్రబృందం బాలకృష్ణను సంప్రదించిదట. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారని తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. తొలిభాగం 'జైలర్'లో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ వంటి అగ్ర నటులు కీలకమైన అతిథి పాత్రల్లో కనిపించారు. ఇప్పుడు సీక్వెల్‌లో బాలకృష్ణ అదే తరహా పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ సినిమాలో బాలకృష్ణ నటిస్తే బాగుంటుందని చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఓ సందర్భంలో చెప్పారు. తాజాగా ఆయన బాలకృష్ణ కోసం ఓ పవర్‌ఫుల్ పాత్రను క్రియేట్ చేశారని అంటున్నారు. కేవలం అతిథి పాత్ర తరహాలో కాకుండా కథాగమనంలో కీలకంగా ఉంటూ పది నిమిషాల నిడివితో బాలకృష్ణ పాత్రను డిజైన్ చేశారని తెలిసింది. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే. ఒకవేళ ఇదేగనుక నిజమైతే రజనీకాంత్-బాలకృష్ణ కాంబోతో థియేటర్లు దద్దరిల్లిపోవడం ఖాయమని అభిమానులు అనుకుంటున్నారు.

# రజనీకాంత్ సలహా పాటిస్తున్నా!



**తమిళ** సూపర్‌స్టార్ రజనీకాంత్ తరహాలోనే వెంకటేష్‌లో కూడా ఆధ్యాత్మిక భావాలు ఎక్కువగా కనిపిస్తాయి. తాజాగా తమిళ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రజనీకాంత్‌తో తనకున్న అనుబంధం, ఆయనిచ్చిన ఓ సలహా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు వెంకటేష్. కెరీర్ తొలినాళ్లలో రజనీకాంత్ ఇచ్చిన సలహాను ఇప్పటివరకు పాటిస్తున్నానని తెలిపారు. 'రజనీకాంత్ మా నాన్నతో కలిసి పనిచేశారు. మా కుటుంబంతో మంచి అనుబంధం ఉంది. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఆయనో మాట చెప్పారు. 'సినిమా రిలీజ్ ఎంత గ్రాండ్‌గా చేశారు? పెద్ద బ్యానర్లు కట్టారా? మ్యాగజైన్స్ ఫ్రంట్ పేజీల్లో మన ఫొటోలు వేశారా? వంటి విషయాల గురించి అస్సలు ఆలోచించొద్దు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మన పని మనం చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడే జీవితంలో ప్రశాంతంగా ఉంటాం' అని సూచించారు. ఆ సలహాను ఇప్పటికీ పాటిస్తున్నా. పబ్లిసిటీ, కలెక్షన్స్ వంటి విషయాల గురించి నేను అస్సలు పట్టించుకోను' అని వెంకటేష్ అన్నారు. తాను దైవాన్ని పరిపూర్ణంగా విశ్వసిస్తానని, ఎన్నో ఆధ్యాత్మిక పుస్తకాలు చదివానని, అరుణాచలం సందర్శనను ఎంతగానో ఇష్టపడతానని, రమణ మహర్షిని ఆరాధిస్తానని వెంకటేష్ చెప్పారు.



# నగరం, తుపాకీ రెండూ ఒకటే..

**'దసరా'** ఫేమ్ దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కింగ్ జాకీ క్వీన్'. కేకే దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఇందులో దీక్షిత్‌శెట్టి రాజు పాత్రలో, యుక్తి తరేజా రాణి పాత్రలో కనిపించారు. 'నగరం, తుపాకీ రెండు ఒకటే, అవి వాటిని పట్టుకున్న వ్యక్తి మాట వింటాయి' అంటూ రాజు చెప్పే డైలాగ్‌తో టీజర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది. 'కత్తితో జీవించేవాడు కత్తితో చనిపోతాడు' అనే బైబిల్ నోట్‌తో టీజర్‌ను ముగించిన తీరు ఆకట్టుకుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దీక్షిత్ శెట్టి తెలిపారు. 1990ల నేపథ్యంలో నడిచే పీరియాడిక్ క్రైమ్ డ్రామా ఇదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాగేష్ బానెల్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి, దర్శకత్వం: కేకే.

# ఆత్మ కలిగిన యంత్రాలు

**స్వీయ** దర్శకత్వంలో పూర్వాజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్‌ఆర్, ఏయు అండ్ ఐ పతాకాలపై పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఏ.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. త్వరలో విడుదలకానుంది. బుధవారం ఈ చిత్ర గ్లింప్స్‌ను తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేశారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలిమెంట్స్‌తో గ్లింప్స్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. ఇందులో ప్రాచీన వైమానిక శాస్త్రంలో ఆశ్చర్యపరిచే మానవ మేధస్సు రహస్యాలను వెల్లడించారు. ఆత్మ కలిగిన యంత్రాలను చూస్తారంటూ వైమానిక శాస్త్రంలో చెప్పిందే నిజం కాబోతుందా అనే ప్రశ్నతో గ్లింప్స్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: ఆశీర్వాద్, సుమన్ జీవ, రచన-దర్శకత్వం: పూర్వాజ్.




# షారుఖ్ అభ్యర్థన మేరకు..



**బాలీవుడ్‌లో** షారుఖ్, దీపికా పడుకోన్ కాంబినేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిందీ చిత్రసీమలో హిట్‌పెయిర్‌గా వారికి గుర్తింపు ఉంది. ఇప్పటివరకు వీరిద్దరు కలిసి ఐదు చిత్రాల్లో నటించగా..అవన్నీ సూపర్ హిట్స్‌గా నిలిచాయి. తాజాగా ఈ జోడీ 'కింగ్' సినిమాలో నటించనుంది. షారుఖ్‌ఖాన్ తనయ సుహానా ఖాన్ ప్రధాన పాత్ర లో రూపొందుతున్న ఈ చిత్రానికి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. సుహానాఖాన్ గురువు పాత్రలో షారుఖ్‌ఖాన్ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో దీపికా పడుకోన్ అతిథి పాత్రలో నటిస్తుందంటూ వార్తలొచ్చాయి. అవన్నీ పుకార్లేనని చిత్రబృందం కొద్ది వారాల క్రితం వివరణ ఇచ్చింది. తాజా సమాచారం ప్రకారం దీపికా పడుకోన్ ఈ సినిమాలో భాగం కానుందని తెలిసింది. తొలుత ఈ సినిమా కోసం 'కింగ్' టీమ్ తనను సంప్రదించినప్పుడు దీపికా పడుకోన్ సున్నితంగా తిరస్కరించిందట. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలతో పాటు పర్సనల్ లైఫ్‌కు సమయాన్ని కేటాయించాల్సి ఉందని, కొత్త సినిమాలు సైన్ చేయలేనని చెప్పిందట. ఆ తర్వాత అతిథి పాత్ర కోసం కత్రినాకైఫ్, సోనమ్ బజ్వా, ప్రీతి జింటా వంటి తారల్ని సంప్రదించారు. వారు కూడా పలు కారణాలతో ఒప్పుకోకపోవడంతో చివరకు షారుఖ్‌ఖాన్ రంగంలో దిగారు. దీపికా పడుకోన్‌ను ఫోన్‌లో సంప్రదించిన షారుఖ్‌ఖాన్ ఎలాగైనా అతిథి పాత్రలో నటించాలని అభ్యర్థించారట. ఆమె డేట్స్ కోసం అవసరమైతే షూటింగ్ షెడ్యూల్స్‌ను మార్చుతామని హామీ ఇచ్చారట. షారుఖ్ రిక్వెస్ట్ మేరకు చివరకు దీపికా సినిమాకు ఓకే చెప్పిందని బాలీవుడ్ టాక్. ఈ సినిమాను మేలో మొదలుపెట్టి ఆగస్ట్‌లోగా పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. అయితే దీపికా పడుకోన్ కాల్షీట్స్ అక్టోబర్‌లో అందుబాటులో ఉండటంతో అప్పటి వరకు వేచిచూడాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని బాలీవుడ్ ఇండస్ట్రీ టాక్.

# 1960 నాటి తెలంగాణ కథ 'భోగి'



**1960ల** నాటి ఉత్తర తెలంగాణ నేపథ్య కథాంశంతో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రానికి 'భోగి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. బుధవారం నుంచి షూటింగ్ మొదలుపెడుతున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. విధి, పోరాటం, మార్పు అంటూ దర్శకుడు కథను నరేట్ చేస్తుండగా..హీరో శర్వానంద్ ఆయన మాటల్ని ఆసక్తిగా వింటూ ఓ యుద్ధం, సంఘర్షణతో కూడిన ప్రపంచాన్ని ఊహిస్తుంటాడు. తిరుగుబాటుదారుడి వీరోచిత పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తమని అర్థమవుతున్నది. 'ప్రతి రక్తపు చుక్కకు ఓ కారణం ఉంటుంది. ప్రతి పండగకు ఓ ప్రయోజనం ఉంటుంది' అని దర్శకుడు సంపత్‌నంది ఈ వీడియోపై వ్యాఖ్యానించారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో జరిగే కథాంశమిదని, అప్పటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టేలా అద్భుతమైన సెట్స్‌కు రూపకల్పన చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, ఆర్ట్: కిరణ్ కుమార్ మన్నె, రచన-దర్శకత్వం: సంపత్‌నంది.



పహల్గాం ఉగ్రదాడి మృతులకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నివాళులర్పించింది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఫిల్మ్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు మురళీమోహన్, ఛాంబర్ కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, 'మా' అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మాదల రవితో పాటు 24 క్రాఫ్ట్స్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రేక్షకుల్లో నేనూ ఒకడినే అనుకుంటా!



- 'ప్రేక్షకులు థియేటర్‌కు రావడం లేదనే మాటలు తరచుగా వినిపిస్తున్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాలు తీస్తే వారు తప్పకుండా థియేటర్లకు వస్తారు. 'హిట్-3' అడ్వాన్స్ బుకింగ్ చూస్తుంటే ఆడియెన్స్ ఈ సినిమా చూడాలని ముందే ఫిక్సైపోయారనిపిస్తున్నది' అన్నారు హీరో నాని. ఆయన తాజా చిత్రం 'హిట్-3' నేడు పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం ఆయన పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..
- 'హిట్-3' ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇందులో నేను పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో కనిపిస్తా. దేశంలోని కొన్ని ప్రధాన నగరాల్లో ప్రమోషన్ కార్యక్రమాల్ని నిర్వహించాం. అంతటా పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఈ సినిమా చూడాలని ఆడియెన్స్ ముందే ఫిక్సైపోయారనిపించింది. 'హిట్-3' యాక్షన్, వయొలెన్స్ కలబోసిన కథ. ఈ సీక్వెల్‌లోని రెండు భాగాలతో పోల్చితే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. కథ డిమాండ్ మేరకే వయొలెన్స్‌ను చూపించాం. అంతేకాని కేవలం వయొలెన్స్ కోసం సినిమా తీయలేదు.
- ఫ్యామిలీ కథల నుంచి వయొలెన్స్ జోనర్‌కు ఎందుకు షిఫ్ట్ అయ్యావని చాలా మంది అడుగుతున్నారు. ప్రతి సినిమాను నేను కొత్త జోనర్‌లో చేయాలని ప్రయత్నం చేస్తాను. హాయ్ నాన్న, జెర్సీ, దసరా..ఇప్పుడు 'హిట్-3' ఇలా వేటికవే డిఫరెంట్ కాన్సెప్ట్స్‌తో సినిమాలు చేస్తున్నా. ఈ ప్రక్రియను నేను మార్పులా చూడటం లేదు. కెరీర్ ముందుకుసాగుతున్న కొద్దీ కొత్త కథలను ఎంచుకుంటున్నా. వయసు పెరుగుతుంది కాబట్టి ప్రేమకథలకు దూరంగా ఉంటున్నా.
- ఈ సినిమాలో వయొలెన్స్ ప్రేక్షకుల్ని డిస్టర్బ్ చేయదు. ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఓ లక్ష్యం కోసం పోలీస్ అధికారి చేసే దుష్ట సంహారం కథలోని హింసను కన్విన్స్ చేసేలా అనిపిస్తుంది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఇప్పటివరకు థ్రిల్లర్ సినిమాలకు పనిచేయలేదు. ఆయన ఈ కథకు వర్క్ చేస్తే ఆ సౌండింగ్ చాలా కొత్తగా ఉంటుందని భావించాం. అనుకున్న విధంగానే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు కొత్త ఫీల్‌ని తీసుకొచ్చింది.
- నటుడిగా నా వృత్తిని పరిపూర్ణంగా ఆస్వాదిస్తాను. అందుకే ఇలాంటి ఇంటెన్స్ క్యారెక్టర్ చేసినా ఏమాత్రం కష్టమనిపించలేదు. మనం చేసే పనిలో ఎక్సైట్‌మెంట్ ఉంటే అస్సలు కష్టంగా అనిపించదు. ఇక ఇండస్ట్రీలోని నెంబర్‌గేమ్, వసూళ్ల రికార్డులపై నాకు అంతగా నమ్మకం లేదు. ఆ విషయాల్లో నేను కాస్త వీక్ (నవ్వుతూ).
- నటుడిగా, నిర్మాతగా నాకు సక్సెస్ పర్సంటేజ్ ఎక్కువ అని చాలా మంది చెబుతున్నారు. సినిమాను బాగా ప్రేమిస్తూ, నిజాయితీగా పని చేయడం వల్లే నాపై ప్రేక్షకులకు ఓ నమ్మకం ఏర్పడింది. ప్రేక్షకుల్లో నేను కూడా ఓ భాగమే అనే భావనతో సినిమాలు చేస్తున్నాను. అందుకే మంచి ఫలితాలు వస్తున్నాయనుకుంటున్నా. ఇక శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చేస్తున్న 'ప్యారడైజ్' చిత్రం ఎపిక్ స్కేల్‌లో ఉంటుంది.





